ప్రజాశక్తి
మంగళవారం 9 జులై 2024
5
విజయనగరం

11న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

వివిధ ప్రయివేటు కంపెనీల్లో మొత్తం 270 ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూసిన్ లిమిటెడ్‌లో భారత్ మనీ ఆఫీసర్, భారత్ మనీ స్టోర్ (100),హెట్రో ల్యాబ్స్ లిమిటెడ్‌లోని క్యుఎ, క్యుసీ ప్రొడక్షన్, మెయింటనెన్స్‌లో (170) ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, బొబ్బిలి, పార్వతీపురం, రాజాం, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో ఆయా పోస్టును బట్టి పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ఎంప్లాయిమెంట్. ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని, 11వ తేదీ ఉదయం 10 గంటలకు విజయనగరం బాలాజీనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు వివరాల కోసం 8919179415నంబరుకు సంప్రదించాలని సూచించారు.

మండల స్థాయిలోనే వినతులు ఇవ్వండి

- అక్కడ పరిష్కారం కాకపోతేనే జిల్లా కేంద్రానికి రావాలి
- ప్రజలకు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ సూచన
- అక్రమ మైనింగ్‌ను సహించేంది లేదు
- ప్రజా వినతుల పరిష్కార వేదికలో 186 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు ముందుగా మండల కేంద్రంలో తహశీల్దార్ లేదా ఎంపిడిఒ కార్యాలయాల్లో వినతులు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో డివిజన్, జిల్లా కేంద్రాల్లో తదుపరి దశల్లో వినతులు ఇవ్వొచ్చని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలపై అర్జీదారులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రానవసరం లేదని, ఆయా మండల కేంద్రంలోనే సంబంధిత అధికారికి అందజేయవచ్చని చెప్పారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు ప్రతి సోమవారం ప్రజావినతుల పరిష్కార వేదికను నిర్వహించి వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళలు వినతులు స్వీకరించారు. 186 వినతులు అందాయి. అనంతరం మండల తహశీల్దార్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఆయా వినతుల పరిష్కారంపై ఆదేశించారు. జిల్లాలో పలు మండలాల నుంచి అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, ఇకపై జిల్లాలో ఎక్కడా అక్రమ మైనింగ్ కార్యకలాపాలను సహించేది లేదని స్పష్టంచేశారు. ఆయా మండలాల పరిధిలో జరిగే అక్రమ మైనింగ్‌పై తహశీల్దార్‌లు, ఆర్‌డిఒలు నిఘా పెట్టి వాటిని నిరోధించాలని ఆదేశించారు. తెర్లాంలో విషజ్వరాలు ప్రబలినట్లు వార్తలు వస్తున్నాయని వెంటనే ఆ మండలాన్ని సందర్శించి అక్కడి జ్వరాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై తనకు నివేదిక ఇవ్వాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. జిల్లాలో నకిలీ విత్తనాలు ఎక్కడా విక్రయించకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ జెడిని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టరేట్‌లో పలు సంఘాలు, వ్యక్తులు తమ వ్యక్తిగత సామాజిక సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతులు అందజేశారు. నగరానికి చెందిన ఫోరం ఫర్ బెటర్ విజయనగరం ప్రతినిధులు విశాఖ- విజయనగరం మధ్య ఏర్పాటు చేసిన టోల్‌గేట్ ప్రజలకు భారంగా మారిందని దీనిని వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ టోల్‌గేట్ అంశంపై ఈనెల 13న జాతీయ రహదారుల సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. తనకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలంటూ వికలాంగురాలు వినతిపత్రం అందించగా సంబంధిత శాఖల అధికారులను పిలిచి జిల్లా కలెక్టర్ చర్చించారు. విభిన్న ప్రతిభావంతులకు కేటాయించిన ఉద్యోగుల భర్తీకి స్పెషల్ డ్రైవ్ చేపట్టినపుడు ఆమె అభ్యర్ధనను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

వికలాంగురాలి సమస్యను వింటున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

డెంకాడ మండలం గుణపూరు రెవెన్యూ సర్వే నెంబరు 60/3 ఆనందరాజు చెరువును కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోగా తాజాగా ఈ ఏడాది మే 24, 25 తేదీల్లో సుమారు 15 ఎక్కల ఆనందరాజు చెరువును అక్రమంగా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బినామీలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఆక్రమణ దారులపై వెంటనే చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు పలువురు రైతులు వినతి అందజేశారు. ఈ విషయమై రైతులు ఆందోళన వ్యకం చేయడంతో జూన్ 4న ఆయా రిజిస్ట్రేషన్లను రద్దు చేసినట్లు భోగాపురం సబ్ రిజిస్ట్రార్ చెప్పినా ఇంత వరకూ రద్దు కాలేదని తెలిపారు. ఈ విషయమై రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. 22 ఎకరాల చెరువును పరిరక్షించడంతో పాటు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన బాధ్యులపైతీసుకొని ఆ చెరువు కిందపంటలు సాగు చేస్తున్న రైతులకు చెరువుపై హక్కు కల్పిస్తూ పట్టాలివ్వాలని కోరారు.

తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలి

ఎపి వెలుగు ఉద్యోగుల సంఘం డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా ఎల్ కోట మండలంలో తొలగించిన 16మంది విఒఎ లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద ఎపి వెలుగు ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వెలుగు ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీతం పెరుగుతుందని, ఉద్యోగ భద్రత ఉంటుందని ఆశిస్తే నెల రోజుల్లోనే చిరుద్యోగులపై వేధింపులు కక్ష సాధింపులకు గురి చేసి తొలగించడం అన్యాయమన్నారు. విఒఎలు గ్రామాల్లో ఉంటూ పొదుపు సంఘాలను సమర్థవంతంగా నడపడంలో కీలకంగా వ్యవహరిస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవెయ్యడంలో ముఖ్యభూమిక పోషిస్తున్నారన్నారు. అటువంటి వారిని గ్రామ సంఘాల ఆమోదం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.శ్యామల, టి.బంగారమ్మ, ఎస్ లక్ష్మి, త్రివేణి, రాధా, ఈశ్వరమ్మ, సరోజినీ, ఉమా, వరలక్ష్మి,కుమారి, రామలక్ష్మి, అపూర్వ, భవాని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వెలుగు ఉద్యోగులు, సిఐటియు నాయకులు

చేయూత డబ్బులు చెల్లించాలని ధర్నా

అర్హులైన లబ్ధిదారులందరికీ చేయూత డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డెంకాడ మండలం పెద్ద తటివాడ గ్రామ మహిళలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. వారికి శ్రామిక మహిళా జిల్లా నాయకులు బి.సుధారాణి, సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్ వారికి.మద్దతు తెలిపారు.

విజయ పరంపర

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో అనంతపురం జిల్లా జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్జీ క్రికెట్ మైదానంలో ఈనెల 2 నుంచి నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విజయనగరం జిల్లా జట్టు తన విజయపరంపరను కొనసాగిస్తుంది. అనంతపురం జిల్లా జట్టుతో 6 వికెట్ల తేడాతో గెలుపొంది తన రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్ లో 129 పరుగులకు ఆలౌట్ కాగా, విజయనగరం జట్టు తొలి ఇన్నింగ్స్ లో 302 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్ లో అనంతపురం జట్టు 241 పరుగులకు ఆలవుట్ అయ్యింది. అనంతరం 67 పరుగుల స్వల్ప లక్ష్యంతో మూడో రోజు సోమవారం మధ్యాహ్నం బరిలోకి దిగిన విజయనగరం జిల్లా జట్టు నాలుగు వికెట్లు నష్టపోయి 69 పరుగులు సాధించి రెండో విజయం తన ఖాతాలో వేసుకుంది. విజయం సాధించిన విజయనగరం జిల్లా జట్టును, కోచ్ బహదూర్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ ఎల్ ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు వర్మ, సర్ఫ్రాజ్, బంగారురాజులు అభినందించారు .

త్వరితగతిన సమస్యలు పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలు విని సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ వారం 44 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్‌పితో పాటు ఎఎస్‌పి అస్మా ఫర్వీన్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి ఎం. వీరకుమార్, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐలు కెకెవి విజయనాథ్, ఇ. నర్సింహ మూర్తి, డిసిఆర్‌బి ఎస్‌ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి ఎం.దీపిక

కమిషనర్ వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక నకు 8 వినతలు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతి పత్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడునకు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎసిపి అమ్మాజీ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా లోపాలుంటే క్రిమినల్ కేసులు

జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం

పురుగు మందులు, విత్తనాలు నాణ్యతా లోపాలు ఉంటే క్రిమినల్ కేసులు పెడతామని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు తెలిపారు. ప్రజాశక్తిలో సోమవారం 'అన్నదాతకు వంచన' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ప్రైవేట్ డీలర్ల వద్దకు విజిలెన్స్ తనిఖీలలో నాణ్యత గురించి ప్రస్తావన లేదని, ఆయా షాపుల దస్త్రాలను, బిల్ బుక్‌లను, లైసెన్స్‌లను పరిశీలించారని తెలిపారు. సదరు యజమాని పంచాయతీ వారు ఇచ్చిన కొత్త డోర్ నెంబర్ తన లైసెన్స్‌లో నమోదు చేయించక పోవడం, స్టాక్ లో తేడాలను గమనించి విత్తనాల అమ్మకాల నిలుపుదల చేసి, పురుగు మందులను జప్తు చేసేందుకు మండల వ్యవసాయ అధికారికి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దుకాణ యజమాని విత్తనాల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో సరిగా నమోదు చేయలేదన్నారు. నాణ్యత అనేది విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలను ల్యాబ్‌లకు పంపించిన తర్వాత మాత్రమే వాటి ఫలితాలను బట్టి తెలుస్తుందన్నారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతి నెలా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులను తనిఖీ చేస్తారని తెలిపారు. నమూనాల విశ్లేషణ తదుపరి నాణ్యత లోపాలు వుంటే కోర్టులో క్రిమినల్ కేసు పెడతామని, ఆ షాపు లైసెన్స్‌లను సస్పెండ్ చేస్తామని పేర్కొన్నారు

నేటికీ అందని ధాన్యం రవాణా ఛార్జీలు

జిల్లా మంత్రికి మొరపెట్టుకున్న మాజీ జెడ్‌పిటిసి పెదబాబు

ప్రజాశక్తి - జామి

జిల్లాలో 2021-22ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు తమ ధాన్యం రవాణ, కళాసి ఛార్జీలు పెట్టుకొని మిల్లుకు తరలించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం కూడా కళాసి ఛార్జీలు కింద క్వింటాకు రూ.22 చొప్పున 80 శాతం డబ్బులను సంబంధిత కొనుగోలు ఏజెన్సీలకు విడుదల చేసింది. కానీ వాటిని రైతులకు ఆయా సంస్థలు చెల్లించలేదు. దీనిపై ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం వివిధ రూపాల్లో పోరాటం చేసింది. దీంతో గంట్యాడ మండలం లక్కిడాం సొసైటీ కార్యదర్శి రామకృష్ణ బుడతనాపల్లిలో పలువురు రైతులకు కలాశీ చార్జీలు అందజేశారు. అందులో బూడతనాపల్లి కి చెందిన చల్ల పెంటయ్య, ఏలిసెట్టి సత్య నారాయణ తదితర రైతులు కళాసి ఛార్జీలు చెక్కు లు అందుకున్నవారిలో ఉన్నారు. కానీ నేటికీ జామి, అన్నంరాజపేట కోపరేటివ్ సొసైటీ పరిధిలో ఉన్న రైతాంగానికి ఆ సొమ్ము అందలేదు. ఇప్పటికే జెడ్‌పిటిసిమాజీసభ్యులు బండారు పెదబాబు అధికారులకు వినతులు అందించగా, తాజాగా జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.

20 శాతం త్వరలో అందిస్తామని హామీ

ప్రభుత్వం నుండి కళాసి ఛార్జీలు విడుదల చేసిన 80శాతం లో క్వింటాకు రూ.14.65పై సలు చొప్పున చెల్లిస్తున్న అధికారులు మిగిలిన మొత్తం ప్రభుత్వం నుండి రావలసిన 20శాతం వచ్చిన అనంతరం ఇచ్చేందుకు జిల్లా కోపరే టివ్ బ్యాంకు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో రైతులకు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

అన్ని చోట్లా రైతులు ముందుకు రావాలి

రైతులకు రావలసిన బకాయిలు రాబట్టు కోవాలి. రైతుసంఘం పోరాట ఫలితంగా కళాసి ఛార్జీలు చెల్లిస్తున్నారు. అన్ని పిఎసిఎస్‌ల వద్ద రైతులు ఆందోళనకు దిగినప్పుడే న్యాయం జరుగుతుంది. రైతుల పోరాటానికి రైతు సంఘం అండగా నిలుస్తుంది.

- బి.రాంబాబు
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

టోల్‌గేట్‌ను వెంటనే తొలగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలపై భారాలు వేసేందుకు డెంకాడ మండలం జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను వెంటనే తీసివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఉపయోగమూ టోల్‌గేట్‌ను ఎవరి కోసం ఏర్పాటు చేశారని ప్రశ్నించారు.ఇప్పటికే అనేక భారాలు వేసిన ప్రభుత్వం మళ్లీ పుండు మీద కారం చల్లిన చందంగా భారాలు వేయడం సరికాదన్నారు. టోల్‌గేట్ వలన బస్సుఛార్జీలు, ఇతర వాహన ఛార్జీలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ మార్గంలో కొత్త రోడ్లు వెయ్యలేదని, పాత రోడ్లకే టోల్‌గేటు పెట్టి ధనార్జన కోసమేనని అన్నారు.ప్రజలు మీద భారాలు వేసే ఈ టోల్‌గేట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టి వి రమణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లు

బకాయి జీతాలు చెల్లించాలి

స్కూల్ శానిటేషన్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌కు బకాయి వేతనాలు చెల్లించాలని, ఎన్నికల రెమ్యునరేషన్ డబ్బులు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, బి.సుధారాణి డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలందరికీ 3 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. 2024 జనరల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా విధులు నిర్వహించిన ఆయాలకు రెమ్యూనరేషన్ చెల్లంచలేదన్నారు. పార్ట్ టైం వర్కర్లు అని చెప్పి ఫుల్ టైం పని చేయిస్తున్నారన్నారు. ఆయాలకు నిర్దిష్టమైన పనిగంటలు లేవని, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్లోనే ఉండాల్సి వస్తుందని అన్నారు. కస్పా లాంటి చోట్ల వేసవి సెలవుల్లో కూడా ఆయాలతో పని చేయించారన్నారు. అనారోగ్యం, కుటుంబ సమస్యలు వచ్చేటప్పుడు సెలవు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని, గుర్తింపు కార్డులతోపాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అర్.రమణమ్మ, ఎల్.సంధ్య, కాళ్ల ఎల్లయ్యమ్మ, అర్.ఉమామహేశ్వరి, ఎస్‌కె భేగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదితికి వినతి

ఎపి మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్, ప్రభుత్వ విద్యాసంస్థల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్, బి.సుధారాణి ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మికి వినతినిచ్చారు. ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పారిశుధ్య కార్మికులకు, ప్లాంటేషన్ కార్మికులకు బకాయిలు చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించవద్దని, యూనిఫామ్ , గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్, అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్‌కె బ్యాగం, నందిని, ఉమా, రామనాయుడు, సురేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని పరిశ్రమలన్నీ భద్రతా ప్రమాణాలను విధిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమల్లో ఎక్కడా ఒక్క ప్రమాదం కూడా సంభవించడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని సిమెంట్ పరిశ్రమలో ఆదివారం ప్రమాదం సంభవించిన నేపథ్యంలో, ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లాలోని పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై కలక్టర్ సోమవారం తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న 65 ప్రమాదకర పరిశ్రమలనూ వెంటనే తనిఖీ చేయాలని రెవెన్యూ, పోలీసు శాఖలను ఆదేశించారు. మంగళవారం నుంచీ ప్రతీ పరిశ్రమను తాశిల్దార్, ఎస్‌హెచ్ఒ సంయుక్తంగా తనిఖీ చేసి, మూడు రోజుల్లో తమకు నివేదికలను సమర్పించాలని చెప్పారు. అగ్నిమాపక అధికారులు కూడా విడిగా ఈ పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి 15రోజుల్లో నివేదికను అందించాలని ఆదేశించారు. మిగిలి ఉన్న సుమారు 540చిన్నాపెద్దా పరిశ్రమలను సైతం దశలవారీగా తనిఖీలు చేయాలని రెవెన్యూ, పోలీసు శాఖలను సూచించారు. అలాగే పరిశ్రమల్లో కార్మికులకు వేతనాల చెల్లింపు, వారి సంక్షేమానికి తీసుకున్న చర్యలపై, ముఖ్యమైన పరిశ్రమలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని కార్మికశాఖను ఆదేశించారు. ఆర్‌డిఒలు సైతం ఆకస్మికంగా అప్పుడప్పుడూ పరిశ్రమలను తనిఖీ చేయాలని, విపత్తుల నిర్వహణా శాఖ డిపిఎం, కాలుష్య నియంత్రణా మండలి అధికారులు కూడా తనిఖీలు నిర్వహించాలని ఆయా శాఖలకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్ గణపతి, డిఎఫ్ఒ రామ్‌ప్రకాష్, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, బి.శాంతి, ఎ.సాయిశ్రీ, డిఎస్‌పి ఎం.వీర్‌కుమార్, డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, డిసిఎల్ సుబ్రమణ్యం, పరిశ్రమలశాఖ డిడి నాగేశ్వర్రావు, డిజాస్టర్ మేనేజ్మెంట్ డిపిఎం రాజేశ్వరి, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ సరిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుక సరఫరాతో భవన నిర్మాణ రంగం ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పార్లమెంటు స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం అశోక్‌బంగ్లా టిడిపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెల రోజుల వ్యవధిలో నెరవేర్చారని తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో ప్రజల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని దాని అనుబంధ రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు కార్మికులకు పనులు లేక పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. టిడిపి అమలు చేసిన ఈ విధానంగా భవన నిర్మాణరంగం పుంజుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, కర్రోతు నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాస్థాయి చెస్‌టోర్నమెంట్ శ్రీచెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని ఫైర్ చెస్ స్కూల్లో సోమవారం నిర్వహించారు. ఓపెన్ విభాగంలో కాంద్రేగుల సోమనాథ్, కాంద్రేగుల ప్రహ్లాద్, (కేంద్రియవిద్యాలయం, విజయనగరం),ఎం.లిఖిత కృష్ణ, పి. భరణ్, బి.సాయి సుదర్శన్ విజేతలుగా నిలిచారు.వీరితో పాటు అండర్-7, 9, 11, 13 విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. న్యాయవాది టి.రాజు, కె.వి. జ్వాలాముఖి, అర్చన , పద్మ పాల్గొనారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు, వ్యకాస నాయకులు

సర్వే చేసిన భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-మెంటాడ

సర్వే చేసిన సాగు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్‌చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నాచేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, ఆర్.రాములు మాట్లాడుతూ మండలంలో ఎన్నికల ముందు కొండలింగాలవలస, జయంతి, ఉద్దంగి, లోతుగెడ్డ, చింతలవలస, ఆగూరు, జిటిపేట రెవెన్యూలో ప్రభుత్వ బంజరు భూములను సర్వే చేసినా నేటి వరకూ పట్టాలు ఇవ్వవలేదన్నారు. పలుగ్రామాల్లో సాగు దారుల భూముల సర్వే జరగలేదన్నారు. పట్టాలు ఇవ్వకపోవడం వల్ల రైతు భరోసా, బ్యాంకు రుణాలు, భూముల అభివృద్ధికి ఉపాధి హామీ ద్వారా నిధులను రైతులు పొందలేకపోతున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి సాగు దారులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, గిరిజనులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలు చెల్లించండి

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

గత రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు ఆప్టా అధ్యక్షులు ఎజిఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్ రావు వినతినిచ్చారు. కెజిబివిల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి, భవిత స్కూల్లో పనిచేస్తున్న ఐఇఆర్‌టిలకు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు క్రాఫ్ట్, డ్రాయింగ్, పీడీలకు, మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న సిఆర్‌పి లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు అందక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.వెంటనే వారికి జీతాలు చెల్లించాలని కోరారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

కాలువ పనుల పరిశీలన

భోగాపురం: భోగాపురం గ్రామంలోని బట్టి కాలువ పూడికతీత పనులను ఎమ్మెల్యే లోకం మాధవి సోమవారం పరిశీలించారు. గ్రామం మధ్యలో నుంచి ఈ కాలువ హైవే వరకు ఉంది. దీనిలో పూడిక ఎక్కువగా ఉండడంతో పెద్ద చెరువు నుంచి వచ్చే నీరు వెళ్లేందుకు ఈ పూడిక తీత పనులను సోమవారం నుంచి ప్రారంభించారు. పంచాయతీ నిధులతో ఈ పనులను చేపడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ పనులను చేపట్టాలని పంచాయతీ విస్తరణ అధికారి ఈ సురేష్ కుమార్, ఇంఛార్జి ఇఇ ఎమ్ సురేష్‌కు సూచించారు. దీని వల్ల వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. న్యాయవాది సుధాకర్, నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ల రాంబాబు, త్రినాథ్, పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

బొబ్బిలి: జిల్లాలో కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి కోరారు. కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారని, హామీను గుర్తు చేసి కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోటలో ఎమ్మెల్యే బేబినాయనను కలిసి కోరారు. కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తే విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకపడుతుందని అన్నారు. కేన్సర్ వ్యాధి బారిన పడిన వారు వైద్యం చేపించుకొకలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిపై బేబినాయన సానుకూలంగా స్పందించారు. ఆయనతో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, టిడిపి నాయకులు కోట్ల సుగుణాకరరావు ఉన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

భోగాపురం: మండలంలోని ముక్కాం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ, పెయింటింగ్‌కు ప్రతిపాదించిన నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఇఇ జి సురేష్‌బాబు తెలిపారు. ముక్కం, కొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట, రామచంద్రపేట, సబ్బన్నపేట, తోటపల్లి, బోయపాలెం, యర్ర ముసలయ్యపాలెం, చేపలకంచెరు, గాబువానిపాలెం, ముంజేరు, జగ్గయ్యపేట, అప్పన్నపేట, విద్యుత్ అంత రాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు అంతర్ పంటలపై అవగాహన

గంట్యాడ: మండలంలోని తాటిపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు సోమవారం అంతర పంటలపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాలు వేయడం వల్ల ఉపయోగాలను వివరించారు. కొబ్బరి, జామ, మునగ, గులాబి తోటల్లో అంతర పంట సాగు గురించి అవగాహన కల్పించారు. వరి విత్తనాలు ఏ విధంగా శుద్ధి చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. దీని వల్ల వరి పంటలో తెగుళ్ల నివారణ అవుతుందని ఖర్చు తగ్గుతుందని అధిక దిగుబడులను సాధించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ అనిత, మాస్టర్ ట్రైనర్ కోటి బాబు, యూనిట్ ఇంఛార్జి గాయత్రి, ఐసిఆర్‌పి సీతారత్నం రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డుల మంజూరుపై అవగాహన

బొండపల్లి: మండలంలోని ముద్దూరులో కౌలు రైతులకు కార్డుల మంజూరుపై సోమవారం వ్యవసాయాధికారి పివి.మల్లికార్జున రావు అవగాహన కల్పించారు. ఈ మేరకు గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు కార్డుల జారీ విధివిధానాల గురించి వివరించి అర్హులైన రైతులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు సర్పంచ్ మునకల పైడిపునాయుడు, మాజీ ఎంపిటిసి పత్తిగుల్ల రాజినాయుడు, విఆర్ఒ కె.ప్రభాకర్ రావు, ముద్దూరు, తమటాడ, బిళ్ళలవలస గ్రామానికి చెందిన రైతులు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ సహాయకులు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అంబళ్ళ సుధారాణి తెలిపారు. సోమవారం ఒమ్మి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమె చేతులు మీదుగా విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పథకాలు వినియోగించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం సతివాడలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో జరుగుతున్న తోటపల్లి కాలువ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, సతివాడ సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, ఒమ్మి నాయకులు ఎల్లం నాయుడు, స్కూల్ కమిటి ఛైర్మెన్ గౌరి నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ముసీడర్‌తో రైతులకు ఉపయోగం

వేపాడ: డ్రమ్ము సీడర్‌తో రైతుకు ఉపయోగమని జగ్గయ్య పేటకు చెందిన రైతు వంటాకు శ్రీను అన్నారు. ఆయనకున్న రెండున్నర ఎకరాల భూమిలో సోమవారం డ్రమ్‌సీడర్ యంత్రం సహాయంతో 1120 రకం వరి విత్తనాలను నాటారు. గతంలో 2.5 ఎకరాలకు వరి నాట్లు వేయాలంటే కనీసం రూ.30వేలు కూలీలకు ఖర్చు అయ్యేదని ఈ డ్రమ్ముసీడర్ విధానం వల్ల కేవలం రూ. 15వేలతోనే పని పూర్తి చేయగలిగామని చెప్పారు. ఈ విధానంతో పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని కలుపు నివారణ ఇబ్బందులు ఉండవని, పంటకు తెగుళ్ల సోకే అవకాశం కూడా తక్కువ అని చెప్పారు. గతంలో ఈ విధానం అవలంబించడం వల్ల తనకు ప్రయోజనం కలిగిందని, అందుకే ఈ ఏడాది కూడా అనుసరిస్తున్నానని చెప్పారు. ఆధునిక పద్ధతుల వల్ల ప్రయోజనాలు పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తన అనుభవాన్ని శ్రీను తెలిపారు.

యంత్రంతో విత్తనాలు నాటుతున్న శ్రీను

కంటి శస్త్రచికిత్సలకు 50 మంది ఎంపిక

శృంగవరపుకోట: పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు శ్రీనిజ, ఎస్.జోగారావు, దివ్య తదితరులు సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 100 మంది రోగులను పరీక్షించి వారిలో 50మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ సిబ్బంది, కేవీఆర్ రాజు సేవలందించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

శృంగవరపుకోట: గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేరణ ప్రాజెక్టులో భాగంగా ఇంటి ఆవరణలో మొక్కలు నాటుదాం, పర్యావరణ పరిరక్షణకు అందరం చెట్లు పెంచుదాం నినాదాలతో కూడిన పోస్టర్ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణ పట్ల ఆలోచన కలిగించేందుకు, పెదఖండేపల్లి రహదారిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ యమ్.చిన్నబాబు, మాడెం.రవి, గీత, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.

ఓబులయ్యపాలెంలో వైద్య శిబిరం

వేపాడ: మండలంలోని ఓబులయ్యపాలెంలో అధిక సంఖ్యలో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో అధికంగా జ్వరాలున్నాయని ల్యాబ్ టెక్నీషియన్ సెలవులో ఉండడం వల్ల టెస్టులు చేయలేకపోతున్నామని ఆమె చెప్పారు. ఏఎన్ఎం గౌరీ, సిబ్బందిని ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పిఎస్ఆర్ మూర్తి, ఏఎన్ఎం, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలని వినతి

బొబ్బిలి రూరల్: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలని ఎం.బూర్జవలస సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు, వార్డు మెంబర్ భాను, టిడిపి నాయకులు జి.శ్రీనివాసరావు, యూత్ అసోసియేషన్ సభ్యులు జి.అప్పలనాయుడు, బి.గణపతి కోరారు. కాలుష్యాన్ని నియంత్రించాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణికు వినతిపత్రం అందజేశారు. గ్రోత్ సెంటర్లో ఫెర్రో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలుష్యాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా ప్రారంభం

- స్టాక్‌యార్డుల వద్ద బారులు తీరిన వాహనాలు
- సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-డెంకాడ, కొత్తవలస, బొబ్బిలి

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సోమవారం నుంచి జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డులను గుర్తించారు. ఇక్కడ ఇప్పటికే నిల్వ ఉన్న ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తారు. ఉచిత ఇసుక కోసం స్టాక్ యార్డుల వద్ద ట్రాక్టర్లు, లారీలు సోమవారం ఉదయం నుంచే బారులు తీరాయి. ఇసుక సరఫరా కార్యక్రమాన్ని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభించారు. డెంకాడ యార్డులో ఉచిత ఇసుక సరఫరా కార్యక్రమాన్ని నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగ మాధవి ప్రారంభించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో, డెంకాడ మండలం పెదతాడివాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్, కొత్తవలస వద్ద ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేశారు. కొత్తవలసలో 11,805 మెట్రిక్ టన్నులు, డెంకాడలో 9,756 మెట్రిక్ టన్నులు, బొబ్బిలిలో 72,466.5 మెట్రిక్ టన్నులు, మొత్తం సుమారు 92వేల టన్నుల ఇసుక ఇప్పటికే నిల్వ సిద్ధంగా ఉండటంతో, ఆయా స్టాక్‌యార్డుల నుంచి సరఫరా ప్రారంభమయ్యింది. జిల్లాలో నాణ్యమైన ఇసుక లభించకపోవడంతో, శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి ఇక్కడి స్టాక్ యార్డులకు ఇసుకను రప్పిస్తున్నారు. ఇందుకు అయ్యే రవాణా వ్యయం, హేండ్లింగ్ ఛార్జీల క్రింద, మెట్రిక్ టన్నుకు రూ.605 చొప్పున వసూలు చేస్తున్నారు. వినియోగదారులు ఇసుకను తీసుకువెళ్లేందుకు వాహనాలను స్టాక్‌యార్డుకు తీసుకువచ్చి, రవాణా ఛార్జీలను చెల్లించి ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో స్టాక్‌యార్డులవద్ద ఇసుకకోసం వాహనాలు బారులు తీరాయి. ప్రతిరోజూ ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ యార్డుల్లో ఇసుక సరఫరా జరుగుతుంది. తీసుకున్న ఇసుకకు తప్పనిసరిగా బిల్లు జారీ చేస్తారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటలు పనిచేసే విధంగా 9032338135 నెంబర్‌తో కాల్‌సెంటర్ అందుబాటులోకి వచ్చింది.

కొత్తవలస: ఇసుక స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఉచిత ఇసుక నిర్ణయం పేదలకు వరం

కొత్తవలస మండలంలోని అర్జున్నపాలెం ఏపీ మోడల్ స్కూల్ వద్ద గల ఇసుక రీచ్‌ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. వైసిపి పాలనలో ఇసుక లేక సామాన్య ప్రజలు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. పేదలు ఇబ్బందులు గుర్తించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ప్రజలకు మేలు చేశారన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అవుతాయని కార్మిక వర్గాలకు ఉపాధి లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో వైసిపి నేతలు ఇసుక మాఫియా చేసి దోచుకున్నారని ప్రజలకు ఇసుక లేక చాలా ఇబ్బంది పడ్డారని ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటైన 20 రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ప్రజలకు న్యాయం చేశామన్నారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తూ జీవో నెంబర్ 43ని విడుదల చేయడం హర్షనీయమన్నారు. ఈ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా కేంద్రం ప్రారంభం

ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు గ్రోత్ సెంటర్‌లో ఇసుక కేంద్రాన్ని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు ఇసుక కేంద్రాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో టన్ను ఇసుకను రూ.605 చెల్లించి పొందవచ్చునన్నారు. ఇసుక అక్రమంగా తరలించకుండా నివారించేందుకు రాత్రి సమయాల్లో పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నదులలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి, టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలు నేర్పాలి

ప్రజాశక్తి – రామభద్రపురం

విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు కూడా ఉపాధ్యాయులు నేర్పాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు ఉచిత స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు మౌళిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యా ర్థులు మంచి ప్రావీణ్యత సాదించాలని ఆకాంక్షించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేలా ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఉండే విద్యా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలురకు మరుగుదొడ్లు లేవని ఒక హింధీ పండిట్ రెండు ఇంగ్లీష్ పోస్టులతో పాటు పిఇటి పోస్టు భర్తీ చేయాల్సి ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు బెంచీలు కూడా లేవని ఆయన తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా బెంచీలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఖాళీ పోస్టుల భర్తీకి విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అన్నదాతపై ఆలపించిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అనంతరం మండలంలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ మోహనరావు, పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఎంపిటిసిలు చంద్ర, తిరుపతిరావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం: బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

డెంకాడ: మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వం తరుపున అన్నీ ఉచితంగా ఇస్తున్నారని, భవిష్యత్తులో విద్యార్థులందరూ ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది కిరణ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం విద్యా కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన ప్లాంట్స్ కొనుగోలు చేయాలని మాజీ ఎంపిటిసి వేచలపు జగ్గు బాబు రూ. 4వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వెంకటరావుకి అందజేశారు. విద్యార్థులకు ఆర్థికంగా సహాయం అందించినందుకు ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఎంవిజిఆర్‌లో సిబ్బంది అభివృద్ధి కార్యక్రమం

ప్రజాశక్తి– డెంకాడ

చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డిఎస్‌టి–సెర్బ్ సౌజన్యంతో వారం రోజులు పాటు నిర్వహించనున్న సిబ్బంది అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైంది. 'ఇంటెలిజెంట్ సైబర్–ఫిజికల్ సిస్టమ్స్, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ రీసెంట్ ట్రెండ్స్ అండ్ అప్లికేషన్స్' పై డిఎస్‌టి–సెర్బ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన యాయిన్ ఎఐ ప్రైవేట్ లిమిటెడ్ బ్లాక్‌చెయిన్ సీనియర్ డెవలపర్ మల్లెల సాయి ప్రశాంత్ ప్రారంభించి మాట్లాడారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ రంగంలో సంచలనాత్మక ఆవిష్కరణలు, పురోగతిపై చర్చించారు. ఈ రకమైన ఎఫ్‌డిపిలను నిర్వహించడం వల్ల విద్యార్థులు, అధ్యాపకులు బ్లాక్ చైన్ టెక్నాలజీపై అత్యాధునిక లైవ్ ప్రాజెక్ట్‌లు, ఒక కస్టమర్, కంపెనీ లేదా రెండు కంపెనీల మధ్య కస్టమర్ డేటాను పంచుకోవడంలో, భద్రత, పారదర్శకతను పెంచడంలో అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిపిపి డాక్టర్ పి శ్రీనివాసరావు, ప్రవీణ్ కుమార్ సింగ్, ఐక్యూఏసీ డీన్ డాక్టర్ వి.నగేష్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి – తెర్లాం

మడలంలోని పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బి.భాస్కరరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విధి నిర్వహణలో ఉన్న ఫార్మసిస్టు పి.ఆదిలక్ష్మిని ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు రోగుల వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సు భవానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ప్రసూతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డెలివరీలు ఎక్కువగా జరిగేవిధంగా శ్రద్ధ వహించాలని సూచించారు. హాజరు పట్టి, చలన పట్టిని (మూవ్ మెంట్ రిజిస్టర్) పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వహించాలని ఆదేశించారు. నేత్ర విభాగం సందర్శించారు. జిల్లా వైద్య శాఖాధికారి సందర్శనలో చంద్ర శేఖరరాజు, సత్యరాజు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

కాలంరాజుపేటను పరిశీలించిన ఎమ్మెల్యే

జిల్లా మలేరియా నివారణ అధికారి మని, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ఒ సూర్యనారాయణ, ఎమ్మెల్యే బేబీనాయన కాలంరాజుపేటలో సోమవారం పరిశీలించారు. కాలంరాజుపేటలో విష జ్వరాలు శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి వీరంతా స్పందించి గ్రామాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్ర సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే గ్రామంలో వాడుతున్న తాగునీటి బావిని మూసివేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి తాగునీరు విషయమై ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

సాగునీరు అందించాలి

ప్రజాశక్తి – రామభద్రపురం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెద్దగెడ్డ ద్వారా చివరి ఆయకట్టు రైతుకు కూడా సాగునీరు అందించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జన్నివలస గ్రామంలో ఉన్న పెద్దగెడ్డ కాలువలను పరిశీలించి ఇరిగేషన్ అధికారులు, రైతులతో ముఖాముఖి అయ్యారు. ఈ పెద్దగెడ్డ ద్వారా సుమారు 3076 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఒక్క జన్నివలస గ్రామానికి మాత్రమే సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 4సంవత్సరాలుగా షిల్టు తీయకపోవడంతో నీరు రావడంలేదని తెలిపారు. దీనిపై ఇరిగేషన్ డిఇ కనకారావు మాట్లాడుతూ నిధులు లేమితో పనులుచేయలేకపోతున్నామని, రూ. 25కోట్లతో కాంక్రీట్ లైనింగ్ పనులు మంజూరైనా నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేయలేకపోయామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ 3 రోజుల్లో 2/70 మిషన్లతో షిల్టు పనులు వేగంగా చేసి రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. మిర్తివలస గ్రామానికి కూడా సాగునీరు అందించగల అవకాశం ఉందా అని అడిగి తెలుసు కున్నారు. లస్కర్లు లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై మరొకసారి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి మండలంలో ఉన్న మరికొన్ని గ్రామాలకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జన్నివలస టిడిపి నాయకులు పత్తిగుళ్ల యోగినాయుడు, పత్తిగుళ్ల సత్యంనాయుడు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

గోవధ శాలలు మూసేయాలని ధర్నా

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

కలెక్టర్, ఎస్‌పి కార్యాలయాల ఎదురుగా ఉన్న అక్రమ గోవధ శాలలను మూసివేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఎపి గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. లేదంటే నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా, అనంతరం మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో హంతకులపై రౌడీషిట్ లు తెరవాలని, గోవధ కేంద్రాల ను సీజ్ చెయ్యాలని అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పశుమాంసం కంపెనీలకు, పశుమాంసం వ్యాపారులకు విజయనగరం అడ్డాగా మారిందన్నారు. అధికారులు తీరు మార్చుకొని గోవద నిషేధ చట్టాలను, జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కెవిఆర్ సత్యనారాయణ, రాజకుమారి, మద్దిల సోంబాబు, రెడ్డిపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని పెద్ద గుడిపాల ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్, పాఠశాల ఆవరణ పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఇంగ్లీషు, తెలుగు చదివించడంతోపాటు, మ్యాథమెటిక్స్ పై కొన్ని ప్రశ్నలు కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

స్థానికంగానే ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి– రామభద్రపురం

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా పరిష్కార వేదిక పేరిట ప్రతీ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో స్పందన పేరుతో నిర్వహించే ఫిర్యాదులు ఇక మీదట ఈ పేరు మీద నిర్వహించి సత్వర పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు. మొదట ఎటువంటి ఫిర్యాదైనా మండల స్థాయిలోనే ఇవ్వవలసి ఉంటుందని ఇక్కడ పరిష్కరించకపోతే ఆర్‌డిఒ కార్యాలయంలో ఇవ్వాలనీ అక్కడ కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారం కాకపోతే అప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలా అంచలంచెల విధానం ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పారు.

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి–విజయనగరం కోట

కంటోన్మెంట్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు సోమవారం కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఇటీవల వివిధ సందర్భాల్లో శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఇచ్చిన పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు.

ధ్రువపత్రాలను అందిస్తున్న ప్రతినిధులు

ధ్రువపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి – కొత్తవలస

కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో శారద స్కిల్ డెవలప్మెంట్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు శారద యాజమాన్యం సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా హెచ్ ఆర్ డిజిఎం హెచ్. సన్యాసిరావు మాట్లాడుతూ 54 మంది అభ్యర్థులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్స్ ధ్రువపత్రాలను శారద యాజమాన్యం పంపిణీ చేసిందని చెప్పారు. శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధిని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త మదిన అప్పల రమణ, మీసేవ ఎడ్యుకేల్ సొసైటీ ప్రతినిధి సుబన్ సాహెబ్ షేక్, శారద అసిస్టెంట్ మేనేజర్ జి. శంకర్రావు, కే.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు ప్రారంభం

శృంగవరపుకోట: పట్టణ కేంద్రంలో గల సంజీవని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నూతనంగా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేపాడ టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, కొత్తవలస మండల పార్టీ ఉపాధ్యక్షులు యల్లపు సూరిబాబు, జామి మండల మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, మాజీ ఎంపిటిసి మల్ల రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు పుట్టా శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, బిశెట్టి అరుణ, అనకాపల్లి చెల్లయ్య, బంగారు నాయుడు, అక్కిరెడ్డి వెంకటరమణ, పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

వేపాడ: మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రాలను సిడిపిఒ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలో అందిస్తున్న భోజనం తల్లులు తింటున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ పరిశీలనలో ఎన్ఎఫ్‌డి ఎన్ అవినాష్ కుమార్, హెచ్ఎన్ఎంటి పి సరోజినీ, బి లక్ష్మీబాయి, సూపర్‌వైజర్ జి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

భోగాపురం: విగ్రహానికి పూలమాలవేస్తున్న బడ్డుకొండ

కొత్తవలస: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి

బొబ్బిలి : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

మాజీ ముఖ్యమంత్రి కీర్తి శేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం వైసిపి, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుర్ల: వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న జెడ్‌పిచైర్మన్

విజయనగరం : నివాళులర్పిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

నెల్లిమర్ల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, ఎంపిపి, తదితరులు

IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE AT CHIPURUPALLI
O.S. 163/2021

BETWEEN.
KORADA SHANKAR RAO .....PLAINTIFF
AND
JAMMULA SHIVA NARAYANA ....DEFENDANT

To
Jammula Shiva Narayana S/o Nageswara rao, Aged 33 Years. Resident of D/o 1-32/20, D-51, 8th line SVN colony, Guntur, Guntur District.

GENERAL NOTICE

Please take notice at the above named plaintiff filed a suit against you for the recovery of suit promissory note amount that the Honorable court issue summons to you, but you want only escaped from the service of the same.

That the above suit posted for your appearance at 10-30 A.M. on 2-8-2024 before the above said court and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and ex party.

(By order of the Honorable Court)

Sri K.JAGADEESWARA RAO
Advocate Chipurupalli,
Vizianagaram District, Cell No-9298501686